క్లుప్తంగా

కో–ఆప్షన్ సభ్యుడు వీరయ్య ఆకస్మిక మృతి



రేపల్లె: మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు డొక్కు వీరయ్య అనారోగ్యంతో గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన గతంలో 1వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. వీరయ్య మృతదేహాన్ని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సోదరుడు మోపిదేవి హరనాథబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



శ్రీరామ్‌నగర్(కర్లపాలెం): నిరు పేదలకు సేవ చేయడం సంతృప్తినిస్తోందని ఇనోయా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దొంతిరెడ్డి చంద్రకిరణ్‌రెడ్డి అన్నారు. ట్రస్ట్ ఆవిష్కరణ సందర్భంగా శ్రీరామ్‌నగర్‌లో వృద్ధులు, వితంతువులు 50మందికి గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. చంద్రకిరణ్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే ధృక్పథంతో ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాత నాగిరెడ్డి, నాయనమ్మ భిక్షావతి జ్ఞాపకార్థం స్వగ్రామంలోని దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ట్రస్టీలు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆట్ల వెంకటకృష్ణారెడ్డి, బోడా లాభాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దూపదీప నైవేద్యానికి ప్రభుత్వ సాయంపై హర్షం

బాపట్ల: దేవాలయాల్లో దూపదీపనైవేద్యానికి ప్రభుత్వం సాయం అందించేందుకు ముందుకురావటం హర్షణీయమని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిగా డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తాను దేవాదాయశాఖ మంత్రిగా బాపట్ల నియోజకవర్గంలో పలు దేవాలయాలకు దూపదీపనైవేద్యానికి నిధులు మంజూరు చేశామని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక వాటిని తీసుకోవటం జరిగిందన్నారు. ఈ మేరకు బాపట్ల నియోజకవర్గంలోని దేవాలయాలకు పథకాన్ని వర్తించేలా చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరటంతో పరిశీలించి 18 దేవాలయాలను ఈ పథకంలోకి తీసుకురావాలని జీఓ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, దేవాలయాల కమిషనర్ ఎస్.సత్యనారాయణకు గాదె కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



చందోలు(కర్లపాలెం): పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. భక్తులు పుణ్య స్నానాలాచరించి స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదంను భక్తులకు పంపిణీ చేశారు.

26న రజక ఆత్మగౌరవ సభ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న రజక ఆత్మగౌరవ మహాసభను నాగార్జున యూనివర్సిటీ ఎదురు చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు తెలిపారు. అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక సంఘాల నాయకులు సాంబశివరావు, వాడాల నాగరాజు, కొల్లూరి శివ, తుమ్మేటి కృష్ణ పాల్గొన్నారు.

దర్గా ఉరుసు మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పొన్నూరు: దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కడప 'అమీన్ పీర్ దర్గా'లో ఈనెల 26 నుంచి జరిగే ఉరుసు మహోత్సవాలలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కిలారి వెంకట రోశయ్య కోరారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం కడప దర్గా ఉరిసే షరీఫ్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యుడు ఎండీ. మునీర్ మాట్లాడుతూ కడప దర్గాలో ఈనెల 26న గంధ మహోత్సవం, 27న ఉరుసు, 28న సభాఖాని, 29న ఖవ్వాలి, 30న జులుసు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరిఫ్, అమీన్ పీర్, సుభాని పాల్గొన్నారు.

పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగనే రావాలి

చెరుకుపల్లి: దేశ చరిత్రలోనే సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది అని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. పొన్నపల్లి సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎంపీపీ పార్టీ శ్రేణులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద రూ.45.21 కోట్ల విలువగల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన భారీ బోర్డును ఆవిష్కరించారు. సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ ముఖ్యమంత్రి తర్వాత 99శాతం నెరవేర్చారన్నారు. పేదవాడు సంతోషంగా ఉండాలంటే మరలా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు పైనం రంగారెడ్డి, నాయకులు కూరేటి శ్రీనివాసరావు, దుండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెదపులివర్రులో రూ.41.12కోట్ల లబ్ధి

భట్టిప్రోలు: పెదపులివర్రు సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ నీలా ఉషారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో నవరత్నాల్లో భాగంగా డీబీటీ, నాన్ డీబీటీ రూపేణా రూ.41.12 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లు ఈవోపీఆర్డీ, నోడల్ ఆఫీసర్ టి. ఉషారాణి, తెలిపారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కొనకాల శ్రీనివాసరావు, నీలా రమేష్, పంచాయతీ కార్యదర్శి శౌరి జోజి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సూరేపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్..

భట్టిప్రోలు: సూరేపల్లి సచివాలయంలో శుక్రవారం సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రత్న ప్రసాద్ పార్టీ శ్రేణులు



పెదపులివర్రులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ



పెరవలిపాలెంలో బోర్డు ఆవిష్కరణ

అన్ని రంగాల్లో అభివృద్ధి

వలివేరు(వేమూరు): వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణారెడ్డి అన్నారు. చుండూరు మండలం వలివేరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లిస్టు, ఖాతాలో జమ అయిన నగదుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర రెడ్డి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగనన్న సేవలు ఎంతో అవసరం

రేపల్లె రూరల్: రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న సేవలు ఎంతో అవసరమని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. పేటేరు గ్రామంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం పరితపించిన ముఖ్యమంత్రి జగనన్నే అని అన్నారు.



వలివేరులో నేతల ప్రచారం



కరపత్రాలు విడుదల చేస్తున్న గాదె వెంకయ్యబాబు

నేడు ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలని అన్న వివరణను కోరేందుకు ప్రజల్లోకి వెళ్తుంటే ఆయన చేసిన సేవలను ప్రజలు కొనియాడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పొందిన లబ్ధిని తెలియజేసే కరపత్రాలను విడుదల చేశారు. రేపల్లె మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మండలి అంజయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, సర్పంచ్‌లు యార్లగడ్డ లక్ష్మీ సోమశేఖర్, కారాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిపాలెం సచివాలయంలో..

పెరవలిపాలెం(వేమూరు): మండలంలోని పెరవలిపాలెం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ విష్ణుమొలకల మైదిలీ రాణి, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య అధ్యక్షత వహించారు. సచివాలయంలో పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్ప్లే బోర్డు ఆవిష్కరించారు. వివిధ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు రూ.24 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పథకాలకు రూ.4 కోట్లు చెల్లించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహన, బొల్లిముంత ఏడుకొండలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకల కరపత్రాలు ఆవిష్కరణ



బాపట్ల అర్బన్: బాపట్ల నియోజకవర్గంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు కోన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. గురువారం ఆయన కోన చాంబర్స్ ఆవరణంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ పాల్ దినకరన్ కుటుంబ సమేతంగా ముఖ్య అతిథిగా హాజరై దేవుని వాక్యం మహిమ పరచడంతో పాటు, మరొక రోజు ఇక్కడే ఉండి స్వస్థత ప్రార్థనలు సైతం నిర్వహించేందుకు వస్తున్నట్లు తెలిపారు. కోన చారిటబుల్ ట్రస్ట్ పండుగల నిర్వహణ ద్వారా పరమత సహనాన్ని, పరస్పర గౌరవాన్ని నేర్పుతూ, స్ఫూర్తిని నింపుతూ తరాలకు మధ్య వారధిగా తన వంతు బాధ్యతను నెరవేర్చుతున్నదని చెప్పడానికి సంతోషిస్తున్నామన్నారు. ఆనందోత్సాహాల మధ్య ప్రభువైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సుధీర్ బాబు, మణి భూషణ్, పెరికల జోసెఫ్ పాల్గొన్నారు.

చడ్డి పంపిణీ

కర్లపాలెం: అయ్యప్ప ఆలయంలో గురువారం పడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు.. అయ్యప్ప స్వాములకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చడ్డి పంపిణీ చేశారు. తొలుత అయ్యప్ప, కుమారస్వామి, వినాయకుని చిత్రపటాలను పూలమాలలతో అలంకరించారు.

సాధన మండలిలో గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో చాతుర్మాస్య వ్రత దీక్ష సమాప్తం, 243వ గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం గురువారం ఏకాదశి పర్వదినం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం మద్దుల నారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. కర్పూర యజ్ఞంలో బూర్లె రామకృష్ణ వెంకట నాగేంద్ర రూపేష్ కుమార్, హేమ పద్మ, తూనుగుంట్ల గంగాధర్, శ్రీ వాణి, బండి నాగరాజు, నాగలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రుషికేష్‌కు చెందిన దయానంద ఆశ్రమం నిర్వాహకులు స్వామి భాస్కరానంద సరస్వతీ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సాధన మండలి అధ్యక్షుడు బూర్లె అరుణకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కర్పూర యజ్ఞంలో పాల్గొన్న దంపతులు, వీక్షిస్తున్న భక్తులు

అన్ని విధాల విద్యార్థులకు ప్రభుత్వం అండ

చెరుకుపల్లి: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యార్థులను అన్ని విధాల ఆదుకున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు అన్నారు. గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిక కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లోని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు గుర్తించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో 53మంది విద్యార్థులకు కళ్ల జోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోనేటి కవిత, పాఠశాల కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, డాక్టర్ సాహేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందజేస్తున్న చెన్ను కోటేశ్వరరావు

ప్రజా సేవే పరమావధిగా పని చేస్తున్న మంత్రి నాగార్జున

టీడీపీ నేత విమర్శకు ఘాటుగా స్పందించిన వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను విమర్శించే అర్హత తూనుగుంట్ల సాయిబాబుకు లేదని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. వేమూరుకి గ్రహణం వీడిందని సాయిబాబా చేసిన వ్యాఖ్యలకు లలిత కుమారితో పాటు వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పార్టీ సీనియర్ నాయకురాలు జి. అరవిందలు గురువారం ఘాటుగా స్పందించారు. మంత్రి నాగార్జున నియోజకవర్గంలో అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడటం గ్రహణంలాగా కనిపించడం శోచనీయమన్నారు. సాయిబాబా భట్టిప్రోలు పంచాయతీలో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను విజయవంతం చేయాలి

నగరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ పోటీలు గ్రామ స్థాయిలో అయిదు రోజులు, మండల స్థాయిలో 7 రోజుల పాటు నిర్వహించాలన్నారు. ఆటల పోటీలకు అవసరమైన క్రీడా మైదానాలను సిద్ధం చేసి, అన్ని ఏర్పాట్లు పూర్తియ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దారు ఎం.ప్రమీల, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఎంఈవో కొలసాని హరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

రాష్ట్ర రగ్బీ జట్టుకు చింతాయపాలెం విద్యార్థి ఎంపిక



కర్లపాలెం: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు 10వ తరగతి విద్యార్థి ఎం.భార్గవ కృష్ణ ఎంపికైనట్లు చింతాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు తెలిపారు. గురువారం పాఠశాలలో రగ్బీ క్రీడాకారుడు భార్గవ కృష్ణను ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు కర్నూలులో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రగ్బీ పోటీలలో విద్యార్థి మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. పూణెలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటాడని చెప్పారు. పీడీ ఎం.గోపి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ



బాపట్ల అర్బన్: పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తిక మాస ఏకాదశి పురస్కరించుకుని గురువారం సహస్ర దీపాలంకరణ, సేవా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కోరికను స్వామివారికి చెప్పుకొని దీపాలు వెలిగించి, తరించారని అర్చకులు కేశవాచార్యులు తెలిపారు. దర్మకర్త బద్రీ నారాయణ దంపతులు పాల్గొన్నారు.

మజూరీ ధరలు పెంచాలి

చేనేత కార్మిక ఐక్య కార్యాచరణ సమితి

రేపల్లె రూరల్: చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకుని బతుకు సాగిస్తున్న కార్మికులకు మజూరీలను పెంచాలని చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు గొట్టుముక్కల బాలాజీ కోరారు. మజూరీలు పెంచాలని కోరుతూ గురువారం తహసీల్దారు డి.మల్లికార్జునరావుకు చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో చాలీ చాలని మజూరీలతో కుటుంబం గడవక అర్థాకలితో బతుకు సాగిస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. చేనేతకు కేంద్రంగా ఉన్న మంగళగిరిలో చేనేత కార్మికులకు పెంచిన విధంగా రేపల్లె ప్రాంతంలోని చేనేత కార్మికులకు 15 శాతం మజూరీలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక నాయకులు మురుగుడు సత్యనారాయణ, మర్రివాడ వెంకట్రావు, కొతరపు సీతారామయ్య, దొంతు శ్రీనివాసరావు, జానం భాస్కరరావు, గోలి వీర రాఘవయ్య, జె. రామాంజనేయులు , వెంకటేశ్వరరావు. కొడాలి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు పి. నాగాంజనేయులు, సీహెచ్. శివశంకర్ పాల్గొన్నారు.



తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

నరేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరీ సమేత రాజరాజ నరేంద్రస్వామికి కార్తిక మాసం ఏకాదశి పర్వదినాన గురువారం ప్రాతఃకాల అభిషేకాలు నిర్వహించారు. దివ్య సువర్ణ కాంతులతో మారేడు, తులసి పుష్ప మాలాంకృత రజత నాగాభరణం అలంకారంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మిగతా ఏకాదశిల కంటే ఈ ఏకాదశికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని భక్తుల విశ్వాసం ఈ పర్వదినాన ఉపవాస దీక్ష చేసే వారు స్వర్గానికి చేరుకుంటారని, శ్రీ మహా విష్ణువు కొలువైన వైకుంఠాన్ని పొందుతారని నమ్మకం. కార్యక్రమాలను దేవాలయ కార్య నిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించగా చైర్మన్ జంపని అంజయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు.



ప్రత్యేక అలంకరణలో రాజరాజ నరేంద్రస్వామి

భక్తిశ్రద్ధలతో పడిపూజ

చుండూరు(భట్టిప్రోలు): స్వామియే శరణమయ్యప్ప నామ స్మరణతో బుధవారం రాత్రి చుండూరు మండలం చినపరిమి గ్రామం మారుమ్రోగింది. స్థానిక గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పంచముఖ మండపాల అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి జొన్నా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారికి 18 రకాల అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. అయ్యప్ప, శివ స్వాములు, భవానీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు

భట్టిప్రోలు: అవతార లక్ష్యాన్ని తెలియజేసిన అవతార పురుషుడు శ్రీ సత్య సాయిబాబా అని బాల వికాస్ బాపట్ల జిల్లా కన్వీనర్ వేములపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలులో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భగవాన్ సత్య సాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఆ నాడే ఆధ్యాత్మిక విలువలతో ఉచితంగా విద్య, వైద్య సేవలు అందించడం ఆదర్శనీయమన్నారు. బాల వికాస్ చిన్నారులు నృత్యాలు, పాటలు, నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు, వేమవరం భజన మండలి కన్వీనర్లు మానేపల్లి సుబ్బారావు, దీవి శివరామకృష్ణ, బాలవికాస్ గురువులు తూనుగుంట్ల నాగమణి, మద్దుల నళిని, మానేపల్లి శశికళ పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నిత్యం ఇలా 'ఆవు'తుంటే ఎలా..!

- రోడ్లపై అడ్డదిడ్డంగా ఆవులు
- ప్రమాదాలకు గురవతున్న వాహనదారులు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని ఓ మెస్ యజమాని కుమారుడు కొద్ది రోజుల క్రితం వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు రెండు నెలల చికిత్స అనంతరం రూ.లక్షల ఖర్చుతో బతికి బయటపడ్డాడు. పట్టణంలోని ప్రధాన సెంటరైన రథం బజారులో ఓ విలేకరి బైక్ పై వెళ్తూ పడిపోయాడు. ఆయన కూడా ఆస్పత్రి పాలై నెల పాటు కదలలేని స్థితిలో ఉన్నాడు. ఇలా బాపట్ల పట్టణంలోని రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ ప్రమాదాల్లో అధిక శాతం ఆవుల కారణంగా జరగడం విశేషం.



పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ఆవుల మంద

తప్పని ప్రమాదాలు, వ్యాపారాలకు ఆటంకం

బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించాక రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. స్థానిక రథం బజారు, జీబీసీ రోడ్ల విస్తరణ చేశారు. ఇది ప్రజలకు ఎంతగానో మేలు చేకూర్చింది. అయితే జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో పారిశుధ్యం చర్యల్లో ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన మునిసిపాలిటీ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బాపట్ల పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆవులు తిష్ట వేస్తున్నాయి. ఆవుల కారణంగా వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.దుకాణాల యజమానులు కూడా ఆవుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పక్కకు తోలుతున్నా వెళ్లడం లేదని, తమ వ్యాపారాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో బాపట్ల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 60 శాతం వరకు ఆవుల కారణంగానే జరిగాయని చెబుతున్నారు. రోడ్లపై తిరిగే ఆవులను బందెల దొడ్డికి తరలించాల్సి ఉన్నా తమకేమీ పట్టనట్లు మునిసిపల్ అధికారులు ఉంటున్నారు. ఆవుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో అనేక సార్లు ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేశారు.